స్వయంగా వాహనం నడిపి..

ఆత్మకూరు: ఆత్మకూరు రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు మంగళవారం పలు పాఠశాలలు, కళాశాలల బస్సులను తనిఖీలు చేశారు. స్వయంగా ఓ స్కూల్ బస్సును నడిపి కండీషన్‌ను పరిశీలించారు. వాహనాలు మరమ్మతులకు గురైతే డ్రైవర్లు వెంటనే సంబంధిత యాజమాన్యానికి చెప్పాలన్నారు. విద్యార్థుల ప్రాణాలు వారి చేతుల్లో ఉంటాయనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. యాజమాన్యాలు సైతం తమ వాహనాలు పూర్తి కండీషన్‌లో ఉండేలా డ్రైవర్లకు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను ఆరా తీశారు. ఆయన వెంట రవాణా శాఖ సిబ్బంది ఉన్నారు.


వాహనాన్ని నడుపుతున్న ఎంవీఐ రాములు

హైవేపై అంతులేని నిర్లక్ష్యం

బిట్రగుంట: కావలి – సున్నపుబట్టి మధ్య జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం ట్రాఫిక్ కోన్‌లు పెట్టేసి సగం రోడ్డును బ్లాక్ చేస్తుండడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. లారీలు, బస్సుల వెనుక వచ్చే వారికి అవి సక్రమంగా కనిపించడం లేదు. దీంతో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయలేక ట్రాఫిక్ కోన్‌లను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. హైవే అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు జరిగే ప్రాంతంలో వాహనచోదకులకు అవగాహన కలిగించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


కప్పరాళ్లతిప్ప సమీపంలో ఇలా..

ఘన నివాళి

సోమశిల: భారత జాతీయ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు వర్ధంతి సందర్భంగా చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్ పైడిమర్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మ్యాథ్స్ టీచర్ చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ ప్రతిజ్ఞను రాసిన పైడిమర్రి తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ప్రతిజ్ఞ దేశభక్తి, సోదర భావం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో టీచర్లు మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, శివకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.


పైడిమర్రికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీచర్లు, విద్యార్థులు

క్లుప్తంగా

సీఐకి సన్మానం



ఆత్మకూరు: నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.గంగాధరంను పట్టణానికి చెందిన పలువురు మంగళవారం సన్మానించారు. విజందొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ కుమార్, ఆస్పత్రి సిబ్బంది సీఐకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆటోనగర్‌కు చెందిన పలువురు ముస్లింలు, యూత్ కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌ను కలిసి శాలువా కప్పి అభినందించారు.

విధులకు వెళ్తూ..

• గుండెపోటుతో వార్డెన్ మృతి

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం ఎస్సీ బాలుర వసతిగృహ వార్డెన్‌గా పని చేస్తున్న మాలపాటి అంకయ్య మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. వివరాలు.. విధుల నిమిత్తం అంకయ్య మర్రిపాడు నుంచి కంపసముద్రం వెళ్తుండగా పెగళ్లపాడు వద్ద గుండెపోటు రావడంతో చనిపోయాడు. స్థానికులు ఈ సమాచారాన్ని బాధిత కుటుంబసభ్యులకు తెలిపారు. అంకయ్య మృతి పట్ల టీచర్లు, విద్యార్థులు సంతాపం తెలిపారు.


అంకయ్య (ఫైల్)

తూర్పుచెన్నంపల్లిలో నేత్ర వైద్య శిబిరం



వరికుంటపాడు: మండలంలోని తూర్పుచెన్నంపల్లిలో మంగళవారం ఆదర్శ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. డాక్టర్లు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఆదెయ్య, లార్డ్ స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ నూనె ప్రసాద్, ఇంకా కొండయ్య, గొల్లపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి తరలించగా..

• వృద్ధుడి మృతి

మర్రిపాడు: మండలంలోని కదిరినేనిపల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు అనారోగ్యంతో ఉండగా స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వృద్ధుడు మంగళవారం చనిపోయాడు. మృతుడిని కృష్ణారావుగా గుర్తించారు. ఆయన వివరాలు తెలిసిన వారు మర్రిపాడు పోలీస్‌స్టేషన్, ఉదయగిరి హాస్పిటల్లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.


మృతుడు కృష్ణారావు

రెండు టిప్పర్ల స్వాధీనం

మర్రిపాడు: అధిక కంకరలోడుతో మంగళవారం వింజమూరు మండలం వెంకట్రాదిపాళెం నుంచి బద్వేల్ సమీపంలోని ఓ ప్లై ఉడ్ కంపెనీకి వెళ్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి మంగళవారం తెలిపారు. కంకర తరలించేందుకు అవసరమైన అనుమతి పత్రాల్లేవని, అంతేకాకుండా అధికలోడు ఉన్నట్లు వెల్లడించారు. డ్రైవర్లు పాకల శ్రీరాములు, పరుచూరి కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మండల పరిషత్ సమావేశం నేడు

• మంత్రి ఆనం రాక

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశానికి విచ్చేస్తారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలతోపాటు సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

టీచర్లపై సర్దుబాటు కత్తి

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చంద్రబాబు మార్కు పాఠం చెప్పారు. సమస్యలు పరిష్కరిస్తారని భావిస్తున్న తరుణంలో గురువుల మెడపై పని సర్దుబాటు కత్తి పడింది. 117 జీఓ రద్దు చేస్తారని అంతా అనుకుంటుండగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో హడావుడిగా సర్దుబాటు ముగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మండలంలో ఫ్యాప్టో నాయకులు సర్కారు తీరుపై కన్నెర్ర చేశారు.

- కూటమి ప్రభుత్వ తీరుతో నష్టపోతున్న గురువులు
- కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన ఫ్యాప్టో


కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు అధికారికి లేఖ ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు (ఫైల్)

సీతారామపురం: సర్దుబాటు పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చంద్రబాబు సర్కారు చుక్కలు చూపిస్తోంది. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ విషయంలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు, అభిప్రాయాలు, సలహాలను పరిగణలోకి తీసుకోకుండానే విడుదల చేసిన టీచర్ల మిగులు జాబితాను చూసి అందరూ కంగుతిన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సోమవారం జరగాల్సిన మండలస్థాయి ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించింది. దీంతో సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. అంతేకాక సంబంధిత వెబ్‌సైట్ నుంచి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఫార్మాట్‌ను తొలగించడంతో సర్దుబాటు ప్రక్రియ ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది.

ఏం చేసిందంటే..

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ రూపురేఖలను చంద్రబాబు సర్కారు మార్చేసిందని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. సర్దుబాటులో భాగంగా బదిలీ అయిన స్థానంలో ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు (వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు) కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఈ తంతును ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేపట్టనుండడంతో గురువులు చాలాదూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ స్థానంలో రేషనలైజేషన్ చేపట్టాలని కొందరు కోరుతుంటే మరికొందరు ఖాళీగా ఉన్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి పదోన్నతులు చేపట్టి తర్వాత ఎస్జీటీ స్థానాల్లో విద్యా వలంటీర్లను నియమించాలని కోరుతున్నారు.

ఇక్కడిలా..

మండలం విషయానికొస్తే ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏలు), ఇద్దరు ఎస్జీటీలను సర్దుబాటు చేయాలి. ఒగూరువాండ్లపల్లి హైస్కూల్లో ముగ్గురు, అయ్యవారిపల్లి, బసినేనిపల్లి, సీతారామపురం హైస్కూళ్లలో ఒకరు చొప్పున, మారంరెడ్డిపల్లి ఆర్సీఎం స్కూల్లో ఇద్దరు ఎస్జీటీలను సర్దుబాటు చేయాల్సి ఉంది. కానీ విద్యాశాఖ అధికారులు ఎనిమిది మంది ఎస్ఏలు, 11 మంది ఎస్జీటీలను జాబితాలో చూపిస్తున్నారు. దీనిని టీచర్ల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

మండలంలో..
ప్రాథమిక పాఠశాలలు : 33
ప్రాథమికోన్నత పాఠశాల : 1
హైస్కూళ్లు : 6
మొత్తం టీచర్ల సంఖ్య : 123
విద్యార్థుల సంఖ్య : 2 వేలకు పైగా..

కౌన్సెలింగ్‌ను బహిష్కరించాం



పాఠశాల విద్యాశాఖ చేపట్టిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ అసంబద్ధంగా ఉండడంతో కౌన్సెలింగ్‌ను బహిష్కరించాం. ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన ఏ అంశాన్నీ పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఈ ప్రక్రియ చేపట్టారు.
– గొర్లవీటి వెంకటేశ్వర్లు, ఫ్యాప్టో నాయకుడు, సీతారామపురం

15 వరకు అభ్యంతరాల స్వీకరణ



విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలపై ఈనెల 15వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తాం. 16న తుదిజాబితా ప్రకటించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17న సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. నిబంధనల ప్రకారం నూరు శాతం పోస్టులు భర్తీ చేయడమే లక్ష్యం.
– షేక్ మస్తాన్‌వలీ, ఎంఈఓ, సీతారామపురం

న్యాయమూర్తి దృష్టికి పాఠశాల సమస్యలు

దుత్తలూరు: మండలంలోని నందిపాడు కేజీబీవీని మంగళవారం ఉదయగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అంజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టారు. కోతుల బెడద అధికంగా ఉందని చెప్పడంతో.. వెంటనే పరిష్కరించాలని అంజయ్య అధికారులను ఆదేశించారు. నీటి సమస్య ఉందని తెలుసుకుని అప్పటికప్పుడు పరిష్కరించారు. వంటగదితోపాటు బియ్యం, కూరగాయలు, పప్పులను పరిశీలించారు. కూరగాయల నాణ్యతపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ఇలాంటివి పంపిణీ చేయకుండా చూడాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉమాశంకర్, కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ప్రిన్సిపల్ అంజనీదేవి, న్యాయవాది సందిరెడ్డి రామారావు, పోలీసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న న్యాయమూర్తి అంజయ్య

మోడల్ స్కూల్లో అవయవదాన దినోత్సవం

కావలి: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఒట్టూరు ఏపీ మోడల్ స్కూల్లో కావలి రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్‌క్రాస్ రక్త కేంద్రం సహకారంతో 400 మంది విద్యార్థులకు ఉచితంగా రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. అగర్వాల్ ఐ క్లినిక్ సహకారంతో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.ఇందిరా అనిల్‌కుమారి, ఎన్‌సీసీ అధికారి సీహెచ్ జయరాం, రోటరీ క్లబ్ ఆఫ్ కావలి అధ్యక్షురాలు ఎస్.స్వర్ణలత, కార్యదర్శి మొగల్ సలీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.


కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హర్ ఘర్ తిరంగా ర్యాలీలు


సంగంలో ర్యాలీ


వరికుంటపాడులో..

సంగం: మండల కేంద్రమైన సంగంలో మంగళవారం ఎంపీడీఓ గోపి, ఈఓపీఆర్డీ అప్పాజీల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా జరిగింది. అధికారులు జాతీయ పతాకాన్ని చేతబట్టి ముందుకు సాగారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

• వరికుంటపాడు: మండలంలోని విరువూరు, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీలు జరిగాయి. ప్రధానోపాధ్యాయులు రమాదేవి, మాలకొండయ్య, స్కూల్ చైర్మన్ గడ్డం వెంగళరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా ఉండాలి

ఆత్మకూరు: అధికారులు బాధ్యతగా ఉండాలని ఆర్డీఓ కె.మధులత ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె అన్ని మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ పరంగా ప్రజల నుంచి అందే అర్జీలకు బాధ్యత వహించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదే క్రమంలో గ్రామాల్లో భూ సమస్యలపై అందే వినతులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కౌలు రైతులకు కార్డుల మంజూరు విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ ఎం.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ మధులత

సర్పంచ్‌లకు కొనసాగుతున్న శిక్షణ


ఉదయగిరిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ


నల్లపరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: శిక్షణలో భాగంగా మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మంగళవారం నల్లపరెడ్డిపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. వివిధ అంశాలపై మండల విస్తరణాధికారి ఉషారాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీ దాసరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

• సీతారామపురం: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండోరోజు జరిగిన సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడారు. వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలను వివరించారు. ఏఓ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

• ఉదయగిరి: శిక్షణలో భాగంగా మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మండలంలోని గండిపాళెంలోని సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

• సంగం: పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు మంగళవారం కోలగట్లలోని సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వారికి విస్తరణాధికారి అప్పాజీ వివిధ అంశాలను వివరించారు.

• కలిగిరి: మండలంలోని నాగసముద్రంలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సందర్శించారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు పాల్గొన్నారు.


సీతారామపురం మండలంలో..


కలిగిరిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ


సంగం మండలంలోని కోలగట్లలో సంపద తయారీ కేంద్రంలో సర్పంచ్‌లు, అధికారులు

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

• ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడి అనేకమంది విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తుంటే తమకు సమాచారం అందించాలన్నారు. వాటిని విక్రయించినా, సేవించినా నేరమన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ అన్వార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.వెంకటసుబ్బయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

వైభవంగా వెంకయ్య స్వామి గ్రామోత్సవం



చేజర్ల: మండలంలోని నాగులవెలటూరులో వెంకయ్య స్వామి మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు చైర్మన్ వేలూరు కేశవచౌదరి తెలిపారు.

పోలీసుల అదుపులో 'మత్తు' నిందితులు?

కావలి: పట్టణంలో మత్తు పదార్థాలల అమ్మకాలు, వినియోగం ఆరోపణలపై కావలి టుటౌన్ పోలీసులు మంగళవారం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. డీఎస్పీ ఎం.వెంకటరమణ పర్యవేక్షణలో టు టౌన్ సీఐ కె.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సీఐని సంప్రదించగా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

కావలి: పట్టణంలో ముసునూరు ప్రాంతంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానికులు శ్రావణపు భక్తవత్సలరెడ్డి జాతీయ జెండాలను వితరణగా ఇచ్చారు. వీటిని మంగళవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, నాయకులు అందజేశారు.

మూగజీవాలకు టీకాలు

చేజర్ల: వర్షాకాలంలో మూగజీవాలకు వ్యాధులు ప్రబలే అవకాశముందని, అందువల్ల ముందుగానే వాటికి టీకాలు వేయించాలని చేజర్ల పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొంతువాపు వ్యాధి ప్రమాదకరమైందన్నారు. కలుషిత నీరు, మేత ద్వారా పశువుల్లో రోగనిరోధకశక్తి తగ్గి ఈ వ్యాధి బారిన పడతాయన్నారు. అందువల్ల టీకాలు వేయించి వాటిని కాపాడుకోవాలని సూచించారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉదయగిరి: మండలంలో ఈనెల 16 నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ ఆక్రమణలు, నిషేధిత 22–ఏ క్లెయిమ్‌లు, రీసర్వేకు సంబంధించి సమస్యలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వ పేర్ల నమోదు, సరిహద్దు సమస్యలు, భూ విస్తీర్ణంలో తేడాలు తదితర వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. 16న కుర్రపల్లి, 17న శకునాలపల్లి, 20న పుల్లాయపల్లి, 21న కోటాయపల్లి, 22న పప్పులవారిపల్లి, 23న ఆర్లపడియ, 24న కృష్ణంపల్లి, 27న గన్నేపల్లి, 28న నేలటూరు, 29న గండిపాళెం, 30న వెంగళరావునగర్, 31న తిరుమలాపురం, సెప్టెంబర్ 3న గుడినరవ, 4న సున్నంవారిచింతల, 5న అప్పసముద్రం, 6న బండగానిపల్లి, 10న జి.చెరువుపల్లి, 11న చెర్లోపల్లి, 12న అయ్యవారిపల్లి, 17న దేకూరుపల్లి, 18న కొండాయపాలెం, 19న మాసాయిపేట, 20న గానుగపెంటపల్లి, 21న గంగిరెడ్డిపల్లి, 22న వెంకట్రావుపల్లి, 25న సర్వరాబాదు, 26న ఉదయగిరిల్లో జరిగే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామాల్లో ఈనెల 16న గ్రామసభలు మొదలవుతాయని ఆత్మకూరు తహసీల్దార్ వి.సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న బొటికర్లపాడు, 17న పడకండ్ల, 20న గండ్లవేడు, 21న నారంపేట, 23న నబ్బీనగరం, 24న పమిడిపాడు, 27న కనుపూరుపల్లి, 28న బండారుపల్లి, 30న నువ్వూరుపాడు, 31న జంగాలపల్లి, సెప్టెంబర్ 3న నాగులపాడు, 4న నెల్లూరుపాళెం, 5న వాశిలి, 6న బోయలచిరివెళ్ల, 10న గొల్లపల్లి, 11న దేపూరు, 12న ఆరవేడు, 13న కరటంపాడు, 15న బట్టేపాడు, 19న మహిమలూరు, 21వ తేదీ ఆత్మకూరుకు సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సదస్సులు జరుగుతాయన్నారు.

సంబరాలకు సిద్ధం

ఆత్మకూరురూరల్: ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సంబరాలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే వేడుకలకు ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.